కొత్త భవన నిర్మాణంపై ఆశ



ఈ ఫొటోలో ఉన్న శిథిలమైన భవనం సెస్ వినియోగదారుల సేవా కేంద్రం. ఇది సుమారు 30 ఏళ్ల క్రితం మండల కేంద్రంలో నిర్మించారు. ఊరికి దూరంగా ఉందనే కారణంతో ఈ భవనం కనీసం ప్రారంభానికి సైతం నోచుకోలేదు. ఈ భవనాన్ని వేరే విధంగానైనా ఉపయోగించుకునే అవకాశమున్నా అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా శిథిలావస్థకు చేరిన ఈ భవనంలోని దర్వాజలు, కిటికీలు, ఇతర సామగ్రి దొంగలపాలైంది. సెస్ కార్యాలయం మాత్రం అప్పటి నుంచి అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య నెట్టుకొస్తున్నారు.

- సొంత భవనం శిథిలం
- ప్రారంభానికి సైతం నోచుకోని వైనం
- ఊరికి దూరంగా ఉందనే సాకు
- అద్దె భవనం అసౌకర్యం
- ఇది బోయినపల్లి సెస్ కార్యాలయం తీరు

బోయినపల్లి: బోయినపల్లి సెస్ పరిధిలో మండలంలోని 23 గ్రామాలతో పాటు కొడిమ్యాల మండలం నల్లగొండ, తిప్పాయిపల్లి గ్రామాలు ఉన్నాయి. బోయినపల్లి, కోరెం, వెంకట్రావుపల్లి, స్తంభంపల్లి, విలాసాగర్, మల్కాపూర్ గ్రామాల్లో 33–11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి.

ఊరికి దూరంగా..

బోయినపల్లి గ్రామానికి కిలోమీటరు దూరంలో వేములవాడ వెళ్లే దారిలో ఈ భవనాన్ని నిర్మించారు. ఊరికి దూరంగా ఉందనే సాకుతో ఈ భవనాన్ని వినియోగించుకోలేదు. దీంతో వృథాగా శిథిలావస్థకు చేరిన ఈ భవన సామగ్రిపై దొంగలు కన్నేశారు. ప్రస్తుతం భవనం ముందు ఉన్న పోర్టికో స్లాబ్‌ను సైతం కూల్చి వేస్తున్నారు.

అద్దె భవనంలో..

ఊరికి దూరంగా సెస్ భవనం ఉండడంతో కొన్నేళ్లుగా స్థానిక గ్రామపంచాయతీ పరిసరాల్లో ఉన్న ఓ అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇది పెంకుటిల్లు కావడంతో వర్షాకాలంలో ఉరుస్తుంది. గత నెలలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఈ కార్యాలయాన్ని సందర్శించారు. శిథిలమైన సొంత భవనాన్ని కూడా పరిశీలించి, ఈ స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సొంత భవన నిర్మాణం చేయాల్సి ఉండగా, గతంలో నిర్మించిన స్థలంలోనే కొత్త భవనం నిర్మిస్తారా? లేక వేరే ప్రదేశంలో నిర్మిస్తారా అనే ప్రశ్నార్థకంగానే ఉంది. సొంత భవన నిర్మాణం ఈ పాలకవర్గం హయాంలోనైనా నిర్మించాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



అద్దె భవనంలో ఉన్న సెస్ కార్యాలయం

నూతన భవనం నిర్మించాలి



సెస్ కార్యాలయ కోసం ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన భవనం పూర్తిగా శిథిలమైంది. అద్దె భవనంలో కార్యాలయ విధులు నిర్వహించడంతో ఉద్యోగులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. నూతన సెస్ పాలకవర్గం కొత్త భవనం నిర్మించాలి. – బోయిని ఎల్లేశ్, బోయినపల్లి

సామగ్రి దొంగలపాలు



గ్రామానికి దూరంగా నిర్మించిన సెస్ భవనం 30 ఏళ్లుగా వృథాగా ఉంది. దీంతో తలుపులు, కిటికీలు, తదితర సామగ్రి సైతం దొంగల పాలైంది. ఇప్పటికైనా సెస్ ప్రతినిధులు సొంత భవనం నిర్మాణం కోసం కృషి చేయాలి .– ఉదారి నర్సింహాచారి, బోయినపల్లి

నూతన భవన నిర్మాణానికి కృషి



సెస్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తా. ఇటీవల సెస్ చైర్మన్ సైతం భవనం పరిశీలించారు. అలాగే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉండేలా చూస్తున్నా. – కొట్టెపెల్లి సుధాకర్, సెస్ డైరెక్టర్, బోయినపల్లి

క్లుప్తంగా

పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి



మాట్లాడుతున్న చొక్కల రాము

వేములవాడఅర్బన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని వైఎస్సార్టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కల రాము అన్నారు. వేములవాడ నందికమాన్ వద్ద పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు అయిన వెంటనే ప్రతిసారి వంటగ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం కేంద్ర ప్రభుత్వానికి అనవాయితీగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1200కు పెరిగిందన్నారు. ఇలా ఇష్టారాజ్యంగా ధరలు పెంచితే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, అనంద్, జింక ఎలయ్య, అనిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న టోని

తంగళ్లపల్లి: మండలం నుంచి ఈనెల 4న సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి పాదయాత్ర, హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్(టోని) పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాత్రి 9 గంటలకు రేవంత్‌రెడ్డి పద్మనగర్ చేరుకుని అక్కడే బస చేస్తారని, శనివారం నుంచి పాదయాత్ర ప్రారంభించి సిరిసిల్ల నేతన్న విగ్రహం వరకు నడుస్తారని అన్నారు. పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లఅర్బన్: విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నార్సింగ్‌లోని శ్రీచైతన్య కళాశాల యజమాన్యం ఒత్తిడి తట్టుకోలేక ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధకరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మరికొంత మంది సిబ్బంది వేధింపులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఈ కళాశాలను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. నాయకులు ఇల్లందు ప్రకాశ్, మండల అధ్యక్షుడు మట్టే నరేశ్, రుద్రవేణి సుజిత్, పాతర్ల వంశీ, గణేశ్, నవీన్,రాజు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం

- నీటి పారుదలశాఖ ఈఈ అమరేందర్
- కెనాల్‌ను పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

ముస్తాబాద్: చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం.. ఒక్క ఎకరం కూడా ఎండినివ్వబోమని నీటి పారుదలశాఖ ఈఈ అమరేందర్ స్పష్టం చేశారు. సాక్షిలో 'పంటలు ఎండుతున్నయ్' అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి నీటిపారుదలశాఖ అధికారులు స్పందించారు. ఎగువ మానేరు ప్రాజెక్టు కుడి కాలువ కింద ఉన్న చివరి ఆయకట్టు పంట పొలాలకు నీరందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈమేరకు ముస్తాబాద్, పోతుగల్, తెర్లుమద్దిలో మానేరు కెనాల్‌ను అధికారులతో కలిసి ఈఈ పరిశీలించారు. వారిని పోతుగల్ సర్పంచ్ తన్నీరు గౌతంరావు, రైతులు కలిసి ఎండుతున్న పంట పొలాలకు నీరందించాలని కోరారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ పెనం మడుగు, లోతు చెరువుల్లో కావాల్సిన స్థాయిలో నీరు లేనందున ముస్తాబాద్, పోతుగల్, తెర్లుమద్ది కెనాల్‌కు నీరు రావడంలేదన్నారు. లోతు చెరువులో చిన్న, చిన్న మరమ్మతు పనులు ఉన్నాయని, నీటి విడుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే మల్లన్న సాగర్ కెనాల్ ద్వారా మద్దికుంట, చీకోడు చెరువులను నింపామని అన్నారు. ముస్తాబాద్‌లో పెద్ద చెరువు, లింగంకుంటలకు నీరు తరలిస్తున్నామన్నారు. ప్రస్తుతం పెద్ద చెరువు ద్వారా నీటి విడుదల జరిగిందన్నారు. కాలువను శుభ్రం చేసేందుకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు చేస్తామన్నారు. వరి బతికివున్నప్పుడే నీరు అందించాలని, వరి ఎండిపోయాక నీరు వస్తే లాభం లేదని సర్పంచ్ గౌతంరావు అన్నారు. వరి ఎండిపోకుండా ముస్తాబాద్ పెద్ద చెరువు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. రైతులే చందాలు వేసుకుని కాలువలో ఉన్న పూడిక, గుర్రపు డెక్కను తొలగించుకున్నారు. డీఈ నర్సింగ్, ఏఈ వంశీకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, బాల్‌నర్స్, పర్శరాములు, మహేశ్, శంకర్ పాల్గొన్నారు.



కెనాల్ శుభ్రం చేయిస్తున్న అధికారులు

పరిహారం ఇవ్వలేదని రోడ్డుకు అడ్డంగా కందకం

ఇల్లంతకుంట: పరిహారం ఇవ్వలేదని, ఒక రైతు రోడ్డుకు అడ్డంగా కందకం తవ్వి రాకపోకలను బంద్ పెట్టాడు. మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన పండుగ అంజయ్య అనే రైతు తన వ్యవసాయ భూమిలోంచి అనంతగిరి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి ప్రభుత్వం రోడ్డు వేసి తనకు పరిహారం ఇవ్వలేదని ఆరోపించాడు. పరిహారం ఇచ్చేంత వరకు రోడ్డుపై రాకపోకలు బంద్ చేయాలని కందకం తవ్వినట్లు తెలిపాడు. ఈ సందర్భంగా రైతు అంజయ్య మాట్లాడుతూ మూడేళ్లుగా అధికారులు పరిహారం ఇప్పిస్తామని మాయమాటలు చెబుతూ మోసం చేస్తున్నారని, తనకు న్యాయం జరిగేంత వరకు ఊరుకునేది లేదన్నారు.



రోడ్డుకు అడ్డంగా తవ్విన కందకం

గ్యాస్ ధర పెంపుదలపై ఆందోళన



తంగళ్లపల్లిలో వంట చేస్తున్న మహిళా నాయకులు



ఇల్లంతకుంట: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ముస్తాబాద్/ఇల్లంతకుంట/బోయినపల్లి/వీర్నపల్లి/తంగళ్లపల్లి/గంభీరావుపేట: గ్యాస్ బండ ధరల పెంపుదలపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లాలోని మండల కేంద్రాల్లో గురువారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ప్రధాన రహదారుల్లో రాస్తారోకో చేపట్టారు. రోడ్లపై కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలిపారు. ఖాళీ గ్యాస్‌బండను ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డివిరుస్తుందని అన్నారు. ప్రధాని మోదీ అంబానీ, ఆదానీలకు కొమ్ముకాస్తూ సామాన్య ప్రజల నడ్డివిరుస్తున్నారన్నారు. సిలిండర్ ధరలు తగ్గించే వరకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీలు జనగామ శరత్‌రావు, వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్, పడిగెల మానస, కరుణ, జెడ్పీటీసీలు గుండం నర్సయ్య, కత్తెరపాక ఉమ, విజయ, సెస్ డైరెక్టర్లు అంజిరెడ్డి, కొట్టెపల్లి సుధాకర్, నారాయణరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సురేందర్‌రావు, పల్లె నర్సింహారెడ్డి, కత్తెరపాక కొండయ్య, గజభీంకార్ రాజన్న, వెంకటస్వామిగౌడ్, మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు ప్రజా సంపద

వేములవాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంపదను కార్పొరేట్ సంస్థలకు అమ్ముతోందని సీపీఎం వేములవాడ డివిజన్ కన్వీనర్ ఎర్రవెల్లి నాగరాజు ఆరోపించారు. వంట గ్యాస్ ధరల పెంపుదల నిరసిస్తూ ఆయన గురువారం పార్టీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ రూ.50, కమర్షియల్ గ్యాస్ రూ.350 పెంచడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. పెంచిన వంటగ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రూ.450 ఉన్న వంటగ్యాస్ ధర, బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారం వచ్చిన తర్వాత రూ.1,200 పైన పెంచడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ముక్తికాంత అశోక్, మల్లారపు ప్రశాంత్, పర్శరాములు, ప్రవీణ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎర్రవెల్లి నాగరాజు

సమాచారం

8న హుండీల లెక్కింపు

సిరిసిల్లటౌన్: కార్మిక క్షేత్రం సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి, పోచమ్మ, విశ్వనాథ ఆలయాల్లో ఈనెల 8న హుండీలు లెక్కిస్తున్నట్లు ఆలయాల ఈవో మారుతిరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పోచమ్మ ఆలయం, ఉదయం 11 గంటలకు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, మధ్యాహ్నం ఒంటిగంటకు శ్రీవిశ్వనాథ స్వామి ఆలయంలో హుండీలు లెక్కించనున్నట్లు వెల్లడించారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రమాదేవి

ముస్తాబాద్: వేసవిలో నీటి సమస్యలు లేకుండా పనిచేయాలని ఎంపీడీవో రమాదేవి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ నీటిని సక్రమంగా వాడుకునేలా చూడాలన్నారు. నీటి లభ్యత, నీటి సరఫరాపై ఎప్పటికప్పుడు మిషన్ భగీరథ అధికారులను కలిసి కోఆర్డినేట్ చేసుకుంటూ నీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. అలాగే స్థానిక నీటి వనరులను ఉపయోగించుకోవాలని సూచించారు. పారిశుధ్యం, ప్లాస్టిక్ నిషేధిత వస్తువులపై సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇస్తుండాలన్నారు. ఎంపీవో ఆరిఫ్, ఏపీవో ఆనంద్‌మోహన్, కార్యదర్శులు ఉన్నారు.

గుడుంబా సేవనం ఆరోగ్యానికి చేటు

రుద్రంగి: హానికర రసాయనాలతో తయారు చేసే నిషేధిత గుడుంబా సేవనం ఆరోగ్యానికి కీడు చేస్తుందని ఎస్సై ప్రభాకర్ అన్నారు. గురువారం రుద్రంగి మండల కేంద్రంలోని ఒడ్డెర కాలనీలో గుడుంబా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుడుంబా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు



మోటివేషన్ క్లాసులకు వెలుతున్న విద్యార్థులు

రుద్రంగి: పదో తరగతి పరీక్షలు రాసే ఎస్సీ బాయ్స్ హాస్టల్స్ విద్యార్థులకు మోటివేషన్ క్లాసులకు గురువారం స్థానిక ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ మాట్లాడుతూ విద్యార్థులు ఎగ్జామ్స్ అంటే భయాందోళనకు గురవకుండా ధైర్యంగా పరీక్షలు రాసి అధిక మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

కొత్త కార్యవర్గం ఏర్పాటులో కమల దళం ?

- సిరిసిల్ల పట్టణ కమిటీ మార్పుపై పరిశీలన
- అధ్యక్షుడు మినహా.. కార్యవర్గంలో మార్పులు
- వారంలోగా ఉత్తర్వులు వెలువడే అవకాశం

సిరిసిల్లటౌన్: కమల దళం కొత్త కార్యవర్గం ఏర్పాటు దిశగా సమాలోచన చేస్తోంది. సిరిసిల్ల పట్టణంలో పార్టీ ఎదుగుదల, ప్రజలకు చేరువయ్యేలా అడుగులు వేస్తోంది. మంత్రి కేటీఆర్ ఇలాఖా కావడంతో ఇన్ని రోజులు పార్టీ పూర్తిస్థాయిలో పుంజుకోకుండా ఉండటంపై అధిష్టానం చాలా రోజులుగా సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఈక్రమంలోనే ఫిబ్రవరి 12న పట్టణ అధ్యక్ష పదవిని నాగుల శ్రీనివాస్‌కు కట్టబెట్టగా.. మిగతా కార్యవర్గాన్ని మార్చడానికి నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ పట్టణం నుంచి అనూహ్యంగా ఓట్లు పోలుకాగా.. అప్పటి నుంచి ఆ పార్టీ సిరిసిల్లలో పట్టుకోసం ప్రయత్నిస్తూనే ఉంది. బీఆర్‌ఎస్ చర్యలకు ప్రతి చర్యలతో ఇప్పటికే బీజేపీ ప్రజల్లో ఉనికి చాటుకుంటోంది. కొత్త కార్యవర్గం ఏర్పాటుతో పార్టీ బలోపేతానికి కారణమైంతుందని జిల్లా, రాష్ట్ర నాయకులు విశ్వసిస్తున్నారు. ఈవిషయమై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా.. కొత్త కార్యవర్గం ఏర్పాటు అనివార్యమైనట్లు తెలుస్తోంది.

మృత్యుఘంటికలు మోగిస్తున్న మూలమలుపులు

- వీర్నపల్లి రహదారిలో 11 ప్రమాదకర మలుపులు
- కనిపించని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు
- ప్రధాన రహదారి విస్తరణలో తొలగించని మలుపులు



వీర్నపల్లి సబ్ స్టేషన్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

వీర్నపల్లి: మూల మలుపులు మృత్యుఘంటికలు మోగిస్తున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు వచ్చి వెళ్లే దారిలో ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. వీర్నపల్లి మండలం పరిధిలోని అల్మాస్పూర్ శివారు నుంచి వన్‌పల్లి వరకు 16 కిలోమీటర్ల 11 మూలమలుపులు ఉన్నాయి. వీటి వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీని కారణంగా ఏడాదికాలంలో 10 వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు యువకులు దుర్మరణం పాలుకాగా, 25 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. ఎల్లారెడ్డిపేట నుంచి మరిమడ్ల వరకు రూ.26 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మించి, మూలమలుపులను తొలగించలేదు. ఫలితంగా భయం నీడన ప్రయాణాలు చేస్తున్నారు.

కనిపించని హెచ్చరిక బోర్డులు

మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో కొత్త వ్యక్తులు ప్రయాణం చేస్తున్న క్రమంలో వేగంతో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయం మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకుండా పోయింది.

వరుస సంఘటనలు

➡ వీర్నపల్లి శివారులోని సబ్‌స్టేషన్ వద్ద మూల మలుపు వద్ద ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో అడవిపదిరకు చెందిన నవీన్ అనే వ్యక్తి మరణించాడు.

➡ రంగంపేట మూలమలుపు వద్ద జరిగిన ప్రమాదంలో మరో యువకుడు ఈ మధ్యనే ప్రాణాలు కోల్పోయాడు.

➡ కంచర్ల శివారులోని మూలమలుపు వద్ద ఆటో బోల్తా పడ్డ సంఘటనలో నిజాంబాద్‌కు చెందిన 11 మంది గాయాలతో బయటపడ్డారు.

➡ ఇటీవల ఓ కారు మూలమలుపు వద్ద అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఐదుగురు ఆయాలు ప్రాణాలతో బయటపడ్డారు.

ఇప్పటికైనా మంత్రి కేటీఆర్ స్పందించి ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశాలు జారీ చేసి ముందుగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తూ శాశ్వత పరిష్కారంగా మూలమలుపులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సూచికలు ఏర్పాటు చేయాలి



మూలమలుపుల వద్ద ఎలాంటి సూచికలు లేకపోవడంతో వాహనదారుల నేరుగా వెళుతూ ప్రమాదాలరు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలమలుపులను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. – నాగారపు లింబయ్య, వీర్నపల్లి

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన దారిలో మూలమలుపులు ఉండడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకొని మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి. – మాలోత్ సతీశ్, రంగంపేట

బీజేపీ సంబరాలు



సిరిసిల్లటౌన్: ఈశాన్య రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలో సంబరాలు జరిపారు. గురువారం సాయంత్రం స్థానిక గాంధీచౌక్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, రాష్ట్ర నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, గౌడ వాసు, గాజుల వేణు, గుండెల్లి వేణు, కొండ నరేశ్, ఎల్లంకి సతీశ్ పాల్గొన్నారు.

వంట గ్యాస్ ధరలు తగ్గించాలి

కోనరావుపేట: పెరిగిన సిలిండర్ ధరలతో సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ధరలను తగ్గించాలని ఐద్వా జిల్లా నాయకురాలు జవ్వాజి విమల డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడుతూ కూరగాయలు, పెట్రోల్ ధరలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు సిలిండర్ ధరలు పెరగడరంతో మరింతగా అవస్థలు పడుతున్నారని , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ధరలను తగ్గించాలని కోరారు. ఆమె వెంట మండల నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కోనరావుపేట: మండలం నిమ్మపి గ్రామానికి చెందిన నెర్ర నవీన్ ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలు కోల్పోగా నిమ్మపల్లి ఎన్నారై సభ్యులు రూ.17,500, మల్యాల లింబయ్య కుమారుడు సురేశ్ మరియల గుడిసె కాలిపోవడంతో వారికి రూ.4,500 విలువైన సరుకులు అందజేశారు.